సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



శుభలేఖ.. ఇచ్చే సమయం లేక

వివాహ ఆహ్వానంలో ట్రెండ్ మారింది. క్రమేపీ పెళ్లిపత్రికల పంపిణీ తగ్గుతోంది. వాట్సాప్ ద్వారా చిటికెలో పెళ్లిపత్రికలు పంపిస్తున్నారు. -8లో



స్కూలు విద్యార్థుల ఆటో బోల్తా

పాఠశాల వదిలాక సొంత గ్రామానికి వెళదామంటే ఆర్టీసీ బస్సు లేదు. ఆటో ఎక్కిన నలుగురు విద్యార్థులు మార్గ మధ్యంలో రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.180
రెండోరకం	రూ.90	రూ.146

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 51 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు తలనీలాల కోసం బహిరంగ వేలం



సిద్దవటం: మండలంలోని వంతాటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న లంకమల అడవుల్లో వెలసిన నిత్యపూజా స్వామి ఆలయంలో ఫిబ్రవరి 25 నుంచి 27వరకు మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి.ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు సమర్పించే తలనీలాల పోగు హక్కు కోసం గురువారం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నారు.ఈ విషయాన్ని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సిద్దవటంలోని శ్రీరంగనాయక స్వామి ఆలయంలో గురువారం ఉదయం 11 గంటలకు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తామన్నారు. ప్రతి పాటాదారుడు ధరావత్తు కింద లక్ష రూపాయలు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు. వేలం ముగిసిన వెంటనే హెచ్చు పాటాదారుని నగదు మినహా మిగిలిన వారి ధరావత్తు డబ్బును వాపసు ఇవ్వనున్నట్లు చెప్పారు. హెచ్చు పాటాదారుడు పూర్తి నగదు చెల్లించి అధికారులతో రషీద్‌ను పొందాలని తెలిపారు.

ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

పీలేరు రూరల్: ఈ ఏడాది రబీలో పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి. చంద్రానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని రేగళ్లు, బాలంవారిపల్లె గ్రామాల్లో పంట పొలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదిలో పంటలు సాగు చేసిన ప్రతి రైతు విధిగా రైతు సేవా కేంద్రాల్లో ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 28వ తేదీ లోపు పట్టాదారు పాసు బుక్, ఆధార్, ఆధార్‌తో లింకైన మొబైల్ నంబరుతో విశిష్ట సంఖ్యను పొందడానికి ఆర్‌ఎస్‌కేలో నమోదు చేసుకోవాలని కోరారు. రైతులు విధిగా ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం నుంచి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ తదితర ప్రయోజనాలు పొందడానికి డిజిటల్ గుర్తింపుకార్డు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ వై.వి. రమణ రావు, ఏవోలు మోహన్, రమాదేవి, టీఏ కరుణాకర్‌రెడ్డి, ఏఈవోలు ఇంద్ర, నజీర్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి చేరిన మదనపల్లె పంచాయితీ

మదనపల్లె: మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వర్సెస్ తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు వివాదానికి సంబంధించిన పంచాయితీ అమరావతికి చేరింది. ఇద్దరినీ పార్టీ కేంద్ర కార్యాలయానికి పిలిపించిన అధిష్టానం..రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నమయ్యజిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ.జనార్ధన్‌రెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ దీపక్‌రెడ్డి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్మోహనరాజు సమక్షంలో సయోధ్య కుదిర్చారు. ఈ సందర్భంగా వారు.. మీడియాలో వచ్చిన కథనాలపై ఇద్దరినీ సుతిమెత్తగా మందలిస్తూనే, పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కష్ట కాలంలో టీడీపీకి అండగా నిలిచి, జెండామోసిన పాత నాయకులు, కార్యకర్తలు పార్టీకి దూరంగా ఉంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇది మంచి పద్ధతి కాదని, అందరినీ కలుపుకుపోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు సూచించారు. ఎమ్మెల్యేను ఉద్దేశించి పరుష పదజాలంతో మాట్లాడటం తగదని, నియోజకవర్గ పాలనలో, అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని తెలుగుయువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబుకు చెప్పినట్లు సమాచారం. ఒకరికొకరు పరస్పర సహకారంతో ముందుకెళుతూ, పార్టీ బలోపేతానికి కృషిచేయాల్సిందిగా ఆదేశించినట్లు తెలిసింది. అయితే...పార్టీ ప్రతిష్ట బజారున పడటంతో నష్టనివారణ చర్యల్లో భాగంగా ఇద్దరి మధ్య బలవంతపు రాజీ కుదిర్చారని, పార్టీ పెద్దలు సమస్యను తాత్కాలికంగా సద్దుమణిగించారే తప్ప పూర్తిస్థాయిలో పరిష్కరించలేదని టీడీపీ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అమరావతిలో పార్టీ పెద్దల సమక్షంలోనూ ఇద్దరు నాయకులు ఎడముఖం, పెడముఖంగా వ్యవహరించడమే ఇందుకు నిదర్శనమన్నారు. నియోజకవర్గంలో ఇద్దరు టీడీపీ కీలకనేతలకు ఇబ్బంది వస్తే..స్పందించిన అధినాయకత్వం, ఎనిమిదినెలలుగా కార్యకర్తలు నలిగిపోతుంటే, వారి గురించి కనీస ప్రస్తావన చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

పాత పథకం.. కొత్త టెండర్లు

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజలు ఫ్లోరైడ్ నీటిని తాగి అనారోగ్యాల పాలవుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మన ప్రభుత్వం రాగానే ప్రతిఇంటికి ఫ్లోరైడ్ రహిత మంచినీటిని అందిస్తా... అని 2017 డిసెంబర్ 30న తంబళ్లపల్లెలో జరిగిన ప్రజా సంకల్పయాత్ర బహిరంగ సభలో అప్పటి ప్రతిపక్షనేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మాటిచ్చినట్టుగా ముఖ్యమంత్రి కాగానే వాటర్‌గ్రిడ్ మంజూరు చేశారు. ఈ హామీ అమలు ఒక్క తంబళ్లపల్లితోనే ఆగిపోలేదు. మదనపల్లె, పీలేరు, పుంగనూరు, రాయచోటి నియోజకవర్గాలకు వర్తింపుజేసిన గొప్ప పథకం వాటర్‌గ్రిడ్.

- టెండర్లు పూర్తయి, ఒప్పందం జరిగిన వాటర్‌గ్రిడ్‌కు మళ్లీ టెండర్లు నిర్వహించిన ప్రభుత్వం
- నిధులు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిది
- ఈనెల 17న టెండర్ల పరిశీలన



గండికోట రిజర్వాయర్

బి.కొత్తకోట: వాటర్‌గ్రిడ్ పథకం ఉన్నది ఉన్నట్టుగా అమలు చేసినా, ప్రాజెక్టు స్వరూపం మార్చక పోయినా ఆ ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్న అక్కసుతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జరిగిన ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. ఈ పనులు వద్దంటూ, కొత్త నివేదిక ఇవ్వాలంటూ అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. అయితే టెండర్లను రద్దు చేసిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూపొందించిన పథక స్వరూపాన్ని మార్చలేకపోయింది. వైఎస్సార్ జిల్లా గండికోట జలాశయం నుంచి కృష్ణా నీటిని తరలించి దాహంతీర్చేలా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన భగీరథ ప్రయత్నాన్ని అడ్డుకోలేకపోయినా అడ్డంకులతో కాలయాపన చేస్తోంది. పుంగనూరు మీద కక్షతో పథకంలో కలిసివున్న పుంగనూరు నియోజకవర్గాన్ని తొలగించారు. ఫేజ్–2లో అమలు చేస్తామంటూ మదనపల్లి నియోజకవర్గ ప్రజలకు మంచినీరు లభించకుండా ద్రోహం చేస్తున్నారు.

రూ.545 కోట్లు పెంచుకుని..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.1,825 కోట్లతో ఐదు నియోజకవర్గాల్లో వాటర్‌గ్రిడ్ పథకం అమలుకు కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రద్దు చేసిన ఈ పనిలో ఐదుకు బదులు, మూడు నియోజకవర్గాలకే పరిమితం చేసింది. జిల్లాలోని మదనపల్లె, చిత్తూరుజిల్లాలోని పుంగనూరు నియోజకవర్గాలను పథకం నుంచి తప్పించింది. అంచనాల విషయంలో పథకం అమలును బట్టి ఉండాలి. పథకం అమలు విస్తరణ తగ్గితే పని అంచనా కూడా తగ్గాలి. అయితే వాటర్‌గ్రిడ్‌లో ఇలా లేదు. పథకాన్ని మూడు నియోజకవర్గాలకు పరిమితం చేసినప్పటికీ అంచనా రూ.2,370 కోట్లకు పెంచుకున్నారు. అంటే గత కాంట్రాక్ట్ ఒప్పందంకంటే రూ.545 కోట్లు అదనం .ఈ విలువతో గతనెలలో ప్రభుత్వం పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ల నుంచి టెండర్లను ఆహ్వానించింది. గతనెల 24 తేదీన టెండర్ల గడువు పూర్తి కావడంతో ఈనెల 17 దాఖలైన టెండర్ల పరిశీలన చేపట్టనున్నారు.

2020లో రూ.2,800 కోట్లు మంజూరు

వాటర్‌గ్రిడ్ పథకానికి 2020లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2,800 కోట్లకు పాలనాపరమైన అనుమతి ఇచ్చింది. గండికోట రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను ఐదు నియోజకవర్గాల్లోని గ్రామీణ, పట్టణ ప్రాంతానికి కలిపి 13,94,757 మంది జనాభాకు తాగునీటిని అందించేందుకు మండలాల్లో పనులకు రూ.1,475 కోట్లు, పట్టణాల్లో పనులకు రూ.1,325 కోట్లు కేటాయించారు. 5,336 పల్లెల్లోని ఇంటింటికి తాగునీటిని అందించాలన్నది లక్ష్యం. 2054 నాటికి 15.16 లక్షల మందికి నీటిని అందించేలా ఈ ప్రణాళిక రూపొందించారు. ఈ పనులు చేపట్టడం కోసం 2023లో టెండర్లు నిర్వహించగా రివర్స్ టెండరింగ్‌లో రూ.1,825.68 కోట్లకు టెండర్ దాఖలైంది. దీనివల్ల ప్రభుత్వానికి రూ.76.08 కోట్లు ఆదా అయ్యింది. కాంట్రాక్టు సంస్థ సర్వే పూర్తి చేసి పనులు మొదలుపెట్టే సమయంలో కూటమి ప్రభుత్వం పనిని రద్దు చేసింది.

మార్పు లేని పథకం



వాటర్‌గ్రిడ్ పథకం అమలు విషయంలో మాత్రం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికతోనే కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. వైఎస్సార్ జిల్లా గండికోట జలాశయం సముద్రమట్టానికి 200 మీటర్ల ఎత్తులో ఉండగా, అక్కడినుంచి కృష్ణాజలాలను జిల్లాలోని గుర్రంకొండ మండలం మామిళ్లవారిపల్లె రీట్రీట్ ప్లాంటు వద్ద 664 మీటర్ల ఎత్తుకు తరలించాల్సి ఉంటుంది. గండికోట నుంచి 3.37 టీఎంసీల కృష్ణా జలాలను తరలించుకోవడం, ఆ నీటిని రీట్రీట్ చేసి పైప్‌లైన్ ద్వారా మూడు నియోజకవర్గాలు, రాయచోటి మున్సిపాలిటీ, బి.కొత్తకోట నగర పంచాయతీలకు సరఫరా, ట్యాంకుల నిర్మాణం, ఉన్న ట్యాంకులకు పంపింగ్, ఇలా ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని సాంకేతిక అంశాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తయారుచేసిన విధంగానే అమలు చేస్తున్నారు. ఇందులో మార్పులకు అవకాశం లేకుండాపోయింది.

రూ.3 వేల కోట్లతో ఫేజ్–2

కూటమి ప్రభుత్వం వాటర్‌గ్రిడ్ నుంచి మదనపల్లి, పుంగనూరు నియోజకవర్గాలను తొలగించగా కొత్తగా ఫేజ్–2 పేరుతో కుప్పం వరకు గండికోట నుంచి కృష్ణాజలాలను తరలిస్తామని చెబుతోంది. తంబళ్లపల్లె మండలం కోటకొండ నుంచి ఒక ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా మదనపల్లి, చిత్తూరుజిల్లాలోని పుంగనూరు, పలమనేరు, కుప్పం, తిరుపతిజిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని యర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాలకు ఇంటింటికి నీటికి అందించేందుకు రూ.3 కోట్లతో ప్రతిపాదించారు. దీనికి త్వరలోనే ప్రభుత్వ అనుమతి వస్తుందని అధికారులు అంటున్నారు.

నేడు షబ్బేబరాత్



రాజంపేటలోని నూరానీ మసీదు

రాజంపేట టౌన్: మరో ఇరవై రోజుల్లో పవిత్ర రంజాన్‌మాసం ప్రారంభం కానుంది. అలాగే రంజాన్ పండుగ ఆగమనాన్ని తెలియజేస్తూ షబ్బేబరాత్ పర్వదినాన్ని గురువారం జిల్లా వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. మసీదుల్లో మత గురువులు, ఆధ్యాత్మిక ప్రసంగీకులు షబ్బేబరాత్ విశిష్టత గురించి వివరించనున్నారు. రానున్న రంజాన్ మాసంలో చేపట్టాల్సిన పుణ్యకార్యాల గురించి తెలియచేస్తారు. పవిత్ర రాత్రి రోజు చేపట్టే ప్రార్థనల కోసం ఆయా మసీదు కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. షబ్బేబరాత్ సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలైన నమాజ్, జికర్, పవిత్ర ఖురాన్ పఠనం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు.

పవిత్రమైన రాత్రి



షబ్బేబరాత్ ఎంతో పవిత్రమైనది, విశిష్టమైనది. ఈ సందర్భంగా ప్రార్థనలు చేస్తే పుణ్యం సిద్ధిస్తుంది. మసీదుల్లో ప్రార్థనలు చేయడం ఎంతో మంచిది. మసీదులకు వెళ్లలేని వారు తమ ఇళ్ళల్లో కూడా చేసుకోవచ్చు. షబ్బేబరాత్ మరుసటి రోజు ఉపవాసం ఉంటే చాలా మంచిది.
–మౌలాన అబుసయిద్, ఇమామ్, ఆయేషా మసీదు, రాజంపేట

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడి

- కర్నూలు రేంజ్ డిఐజీ కోయ ప్రవీణ్
- రాయచోటి అర్బన్ స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్, ప్రక్కన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి: జిల్లాలో నేరాల కట్టడికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆదేశించారు. బుధవారం అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుతో కలిసి రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌ను డీఐజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నేరాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి ఆయన సూచించారు. ఫిర్యాదు దారులపట్ల స్నేహభావాన్ని పెంపొందించుకొని సత్ప్రవర్తనతో ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి చట్ట పరిధిలో బాధితులకు న్యాయం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల చర్యల పట్ల ఎప్పటికప్పుడు పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నామన్నారు. అసాంఘిక కార్యక్రమాలను ప్రేరేపించే వారిపట్ల ప్రత్యేక దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అపార్ట్‌మెంట్‌లు, షాపులు, ప్రధాన రహదారులు, పాఠశాలల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి వివరించి వాటిని అమర్చుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించామన్నారు. ప్రతివారం మహిళా పోలీసులతో కలిసి పాఠశాలల్లో, పబ్లిక్ ప్రదేశాల్లో మాదక ద్రవ్యాలు, బాల్య వివాహాలు, మహిళలపై జరిగే నేరాలు, ఆన్‌లైన్, సైబర్ మోసాలు, వైట్ కాలర్ నేరాలు తదితర విషయాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించామన్నారు. అంతకు ముందు రాయచోటి స్టేషన్ పరిధిలో పెండింగ్ కేసుల వివరాలు, రికార్డుల నిర్వహణ, శాంతి భద్రతల పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఐజీ పోలీసులకు తగు సూచనలు, సలహాలు చేశారు. డీఐజీ అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం వెంకటాద్రి, రాయచోటి సీఐ ఎస్ వరప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పి రాజా రమేష్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ తులసీరామ్, రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు, బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పి రాజ రమేష్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ తులసీరామ్, రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు నరసింహారెడ్డి, అబ్దుల్ జహీర్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



పీజీఆర్ఎస్ అర్జీలపై సమీక్ష జరుపుతున్న కలెక్టర్ శ్రీధర్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే, రెవెన్యూ సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ తో కలిసి, మండలంలోని పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 6 నుంచి జనవరి 8 వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భాగంగా మండలంలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో తీసుకున్న చర్యలపై తహసీల్దార్ ధనుంజయలును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..నాణ్యతే ప్రామాణికంగా పీజీఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో జిల్లా వ్యాప్తంగా పీజీఆర్ఎస్‌లో 11వేల దరఖాస్తులు అందగా, ఇప్పటివరకు 5వేల దరఖాస్తులను పరిష్కరించామన్నారు. పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో మదనపల్లి మండలం బాగా వెనకబడిందని కలెక్టర్ అన్నారు. రెవెన్యూ సదస్సులో భాగంగా.. మదనపల్లి మండలంలో సర్వేతో కలిపి మొత్తంగా 1361 దరఖాస్తులు వచ్చాయి. అయితే గత 60 రోజుల్లో కేవలం 285 దరఖాస్తులు, అంటే 20శాతం మాత్రమే రెవెన్యూ సిబ్బంది పరిష్కరించారన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో కొత్తపల్లె, వేంపల్లె, పోతబోలు వీఆర్వోలు మంచి పనితీరు కనపరిచారన్నారు. కోళ్ల బైలు, పొన్నుటిపాలెం, వెంకప్ప కోట, కోటవారిపల్లి, బికేపల్లి, మాలెపాడు వీఆర్వోలు వెనుకబడి ఉన్నారన్నారు. దాదాపు రెండు నెలల సమయం ఉన్నా కూడా అతి తక్కువ ప్రగతి సాధించారన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో వెనుకబడిన వీఆర్వోలను మండలంలోని ఇతర ప్రాంతాలకు పంపుతామన్నారు. అక్కడ కూడా సరైన పనితీరు కనపరచకపోతే ఇతర మండలాలకు బదిలీ చేస్తామన్నారు. మండలంలో ప్రభుత్వ భూములను ఎక్కడైనా ఆక్రమణ జరిగినట్లు గుర్తిస్తే వెంటనే తొలగించి స్వాధీనం చేసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా ప్రభుత్వ భూములకు వాటికి రక్షణ కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు.

రెవెన్యూ సమస్యలపై వేగంగా స్పందించాలి

కురబలకోట: వివిధ రెవెన్యూ సమస్యలపై వేగంగా స్పందించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కురబలకోట తహసీల్దారు కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా డిసెంబర్ 6 నుంచి జనవరి 8 వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల అర్జీల ప్రగతిపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలపై క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి వెంటనే పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో వేగం నాణ్యత రెండూ ముఖ్యమేనన్నారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను వెంటనే గుర్తించి వాటిని యుద్ధప్రాతిపదికన తొలగించాలన్నారు. తహసీల్దారు తపస్విని, ఎంఆర్ఐ బాలసుబ్రమణ్యం,సర్వేయర్ భువనేశ్వరి, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారి మధుసూధన్‌రావు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి మార్చి 5వ తేదీ వరకు వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలు చూసేందుకు స్థానికులతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలి వస్తారన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించాలన్నారు. దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ వాసు, తహసీల్దార్ పుల్లారెడ్డి, విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పౌర్ణమి కల్యాణం



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆలయంలోని నూతన బాలాలయం ప్రాంగణంలో ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసి సీతారాముల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చారు. అర్చకులు వీణా రాఘవాచార్యులు, వీణా మనోజ్ కుమార్‌లు ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, తులసి, గజమాలలతో అలంకరించారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణఘట్టాన్ని నిర్వహించారు.భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, టీటీడీ సివిల్ విభాగం ఏఈ అమర్నాథ్ రెడ్డి, ఆలయ విజిలెన్స్ పర్యవేక్షణ అధికారి గంగులయ్య తదితరులు పాల్గొన్నారు. –ఒంటిమిట్ట

కన్న బిడ్డని దక్కకుండా చేస్తారా?

- ప్రైవేట్ ఆసుపత్రి నిర్లక్ష్య వైద్యంపై రోడ్డుపై బైఠాయించి బాధితుల నిరసన



రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

మదనపల్లె: మొదటి కాన్పులో పుట్టిన తమ కన్న బిడ్డకు, ప్రైవేటు ఆసుపత్రిలో నిర్లక్ష్యంగా చికిత్స చేసి, తమకు దక్కకుండా చేస్తారా అని ఆవేదన వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి ప్రైవేటు ఆసుపత్రి వైద్యులను నిలదీశారు. నడి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమ బిడ్డను ఆసుపత్రి నుంచి తీసుకెళ్తే నగదు ఇస్తామంటూ ఆసుపత్రి సిబ్బంది బేరసారాలకు దిగారంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. 12 రోజులపాటు చికిత్సలు చేసి మా బిడ్డ శవాన్ని అప్పగిస్తారా? అంటూ ఆసుపత్రి డాక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మదనపల్లె మండలం, వేంపల్లి హరిజనవాడకు చెందిన వెంకటేష్‌కు రెండు సంవత్సరాల క్రితం స్వాతితో వివాహమైంది. జనవరి 30న మొదటి కాన్పులో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డ 1.75 కిలోలు మాత్రమే బరువు ఉండడంతో, స్థానిక వైద్యుల సూచన మేరకు, మదనపల్లె పట్టణం అమ్మినేని వీధిలో ఉన్న , చిల్డ్రన్స్ హాస్పిటల్ కు తీసుకొచ్చి అడ్మిట్ చేశారు. అప్పటినుంచి స్థానిక ప్రైవేటు వైద్యశాలలో బిడ్డను ఇంక్యుబేటర్లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ప్రతిరోజు తల్లి బాబుకు పాలు పట్టడం, బిడ్డ పరిస్థితి బాగా ఉందని డాక్టర్ చెప్పడంతో సంబరపడ్డారు. ఆరోగ్యశ్రీలో చికిత్స చేస్తామంటూనే, విడతల వారీగా రూ 40 వేలు జమ చేయించుకున్నారు.బుధవారం రాత్రి ఉన్నట్టుండి మీ బిడ్డ పరిస్థితి విషమంగా ఉందని, హార్ట్ బీట్ తగ్గిపోయిందని,వెంటిలేటర్ పై ఉంచామని, వెంటిలేటర్ తీసివేస్తే చనిపోతాడని తల్లిదండ్రులకు తెలిపారు. అంతకుముందే ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది బిడ్డ తల్లిదండ్రులతో మాట్లాడుతూ మీ బిడ్డ పరిస్థితి బాగోలేదు, మీరు ఆస్పత్రి నుంచి తీసుకువెళ్తే యాజమాన్యం మీరు చెల్లించిన నగదు తిరిగి ఇచ్చేస్తారంటూ,బేరసారాలకు దిగారు. ఇంతలోనే డాక్టర్ బిడ్డ పరిస్థితి చెప్పడంతో, ఎందుకు ఇలా జరిగిందని నిలదీశారు. నమ్మి వస్తే నట్టేట ముంచారని కన్నీటి పర్యంతం అవుతూ, డాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల మద్దతు దారులతో కలిసి నడిరోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. నడిరోడ్డుపై ఇరువైపులా వాహనాలు ఆగిపోవడంతో సమాచారం అందుకున్న వన్టౌన్ ఎస్సై శివకుమార్ అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. నిరసన విరమించి సమస్యపై ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై డాక్టర్ మాట్లాడుతూ బిడ్డ ఎనిమిదో నెలలో జన్మించిన కారణంగా బరువు తక్కువగా ఉందన్నారు. చికిత్సలు అందించడంలో లోపం లేదని, హార్ట్ బీట్ తగ్గిపోయి హిమోగ్లోబిన్ స్థాయిలు పూర్తిగా పడిపోవడంతో వెంటిలేటర్ పై ఉంచామన్నారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

నిరాహార దీక్ష భగ్నం



నాన్ టీచింగ్ స్టాఫ్‌తో మాట్లాడుతున్న రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ మంగంపేట పాఠశాల ఎదురుగా 17 రోజుల నుంచి నాన్ టీచింగ్ స్టాఫ్ చేస్తున్న నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. ఎలాంటి నోటీసులు లేకుండా పాఠశాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్ పది మందిని పాఠశాల కాంట్రాక్టు యాజమాన్యం తొలగించింది. దీంతో వారు 17 రోజులుగా సీఐటీయూ కార్మిక సంఘం నాయకుల మద్దతుతో దీక్ష చేస్తున్నారు. అయితే ఎలాంటి పరిష్కారం చూపకుండా దీక్షను భగ్నం చేశారు. రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు నాన్ టీచింగ్ స్టాఫ్‌తో మాట్లాడుతూ పది రోజుల్లో సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కరించకుండా దీక్షను భగ్నం చేయడాన్ని అన్నమయ్య జిల్లా సీఐటీయూ గౌరవాధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ ఖండించారు.

భార్యపై భర్త దాడి



భర్త దాడి చేయడంతో గాయపడిన రోషిణి

మదనపల్లె : భార్యపై అనుమానం పెంచుకొని మద్యం మత్తులో భర్త దాడి చేసి గాయపరిచిన సంఘటన బుధవారం మదనపల్లెలో జరిగింది. అనంతపురం జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన శివకుమార్, రోషిణి (22). దంపతులు. శివ కుమార్ చేనేత కార్మికుడు కావడంతో మూడు నెలల క్రితం, మదనపల్లెకు వచ్చి నీరుగట్టు వారిపల్లె లోని గౌతమ్ స్కూల్ సమీపంలో నివసిస్తున్నారు. శివకుమార్ స్థానికంగా ఓ మగ్గం యజమాని వద్ద చేనేత కార్మికుడిగా పని చేస్తున్నాడు. మద్యానికి తీవ్రంగా బానిసై, ప్రతిరోజు ఇంట్లో భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో బుధవారం పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చిన శివకుమార్ భార్యపై అనుమానంతో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం పెరగడంతో, ఇంట్లో ఉన్న రోకలి బండతో ఆమెపై దాడి చేశాడు. ఈ దాడిలో రోషిణి తలకు తీవ్ర గాయం కాగా, స్థానికులు బాధితురాలిని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వన్ టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కుక్కల దాడిలో ఐదు పొట్టేళ్లు మృతి



మృతి చెందిన పొట్టేళ్లు

గాలివీడు : మండలంలోని నూలివీడు పంచాయతీ ఆవుల రెడ్డిగారిపల్లె వాసి నరసింహారెడ్డికి చెందిన ఐదు పొట్టేళ్లపై కుక్కలు దాడి చేయడంతో అవి మృతి చెందాయి. బాధితుని కథనం మేరకు.. నరసింహారెడ్డి కొన్నేళ్ల నుంచి పొట్టేళ్లను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం వరకు పొట్టేళ్లను మేపుకొని తిరిగి ఇంటి సమీపంలోని దొడ్డిలో తోలాడు. మంగళవారం రాత్రి కొన్ని కుక్కలు పొట్టేళ్లు ఉన్న దొడ్డిలోకి దూరి దాడి చేయడంతో ఐదు పొట్టేళ్లు మృతి చెందాయి. బుధవారం ఉదయం ఈ సంఘటన వెలుగు చూసింది. ఒక్కో పొట్టేలు విలువ రూ.15000 వరకు చేస్తుందని తెలిపాడు.

శుభలేఖ..

స్వయంగా ఇచ్చే సమయం లేక!





రాజంపేట టౌన్ : ఒకప్పుడు వివాహ వేడుకలో అన్నింటికంటే పెద్ద పని బంధువులకు, మిత్రులకు, ఆత్మీయులకు శుభలేఖలు ఇచ్చి ఆహ్వానించడం. అప్పట్లో స్వయంగా ఇంటికి వెళ్లి పెళ్లి పత్రిక ఇచ్చి ఆహ్వానించడాన్ని ప్రజలు గౌరవంగా భావించేవారు. సమయం లేక.. ఇంటికి వెళ్లలేక మార్గమధ్యంలో కనిపించి పెళ్లిపత్రిక ఇస్తే పెళ్లిపత్రిక అందుకున్న వారు దానిని చిన్నతనంగా భావించేవారు కూడా. అయితే ఆధునిక కాలం అన్నింటిని మార్చేస్తూ వస్తోంది. అందులో వివాహ ఆహ్వానాల్లోను కొత్త ట్రెండ్ వచ్చేసింది. ఇప్పుడు దగ్గరి బంధువులకు, అతి ముఖ్యమైన వారికి మాత్రమే స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి పెళ్లి పత్రికలు ఇచ్చి ఆహ్వానిస్తున్నారు. ఇక మిత్రులను, వివిధ ప్రాంతాల్లో ఉండే తెలిసిన వారిని ఆహ్వానించడం క్షణాల్లో జరిగిపోతుంది. ప్రస్తుతం దాదాపు అందరి చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉండటం వల్ల వధూవరులతో పాటు వారి తల్లిదండ్రులు వెడ్డింగ్ ఇన్విటేషన్ పేరుతో వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేస్తున్నారు. ఇక మిత్రులను, ఆత్మీయులను, పరిచయస్తులను ఆ గ్రూపులో చేర్చి పెళ్లిపత్రికను పంపిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డాక్టర్లు, వ్యాపారవేత్తలు, ఉన్నత విద్యావంతులు ప్రీవెడ్డింగ్ షూట్ వీడియో క్లిప్పింగ్స్‌ను గ్రూపులో పెట్టి ఆహ్వానిస్తున్నారు. చివరిగా 'సేవ్ ది డేట్' అని వివాహ తేదీ, సమయం తెలిపే డిజిటల్ కార్డును కూడా గ్రూపులో పెడుతున్నారు. వివాహానికి వచ్చేవారు కల్యాణ మండపం ఎక్కడుందో తెలుసుకోవడానికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు గూగుల్ మ్యాప్ లొకేషన్‌ను కూడా షేర్ చేస్తున్నారు. వాట్సాప్ గ్రూపులో పెళ్లిపత్రిక షేర్ చేసి ఆహ్వానించడమే కాక అతి ముఖ్యమైన మిత్రులకు, ఆత్మీయులకు ఫోన్ చేసి ఆహ్వానిస్తున్నారు. అయితే కొంతమంది ఇదేం పిలుపు అంటూ నిట్టూర్చేవారు లేక పోలేదు. ప్రస్తుతం అందరికి బంధుగణం ఎక్కువైంది, మిత్రులు, పరిచయాలు ఎక్కువయ్యాయి అందువల్ల సాంకేతికతను ఉపయోగించుకొని ఆహ్వానించడంలో తప్పులేదంటోంది నేటి తరం యువత. చాలా మంది వివాహ ఆహ్వాన పత్రికలను అతి తక్కువగా అచ్చు వేయిస్తున్నారు. ఇక పిల్లల మొదటి పుట్టిన రోజు, గృహప్రవేశం, ఆఫ్‌శారీ ఇలా ఫంక్షన్ ఏదైనా ఆహ్వానాలు వాట్సాప్ గ్రూపుల్లోనే సాగుతున్నాయి. ఈ కారణంగా శుభలేఖలు విక్రయించే వారికి, ప్రింటింగ్ ప్రెస్ వారికి ఆదాయం కూడా తగ్గింది.

చాలా హెల్ప్ అయింది



గత ఏడాది నా కుమారుడి వివాహం చేశాను. నాకుబంధువులు, మిత్రులు, ఆత్మీయులు ఎక్కువ స్థాయిలో ఉన్నారు. అందువల్ల చాలా మంది ఇళ్లకు స్వయంగా వెళ్లి పెళ్లిపత్రిక ఇచ్చి ఆహ్వానించలేక పోయా. స్వయంగా వెళ్లి ఆహ్వానించలేని వారందరిని కలిపి వాట్సాప్‌లో ఓ గ్రూపు ఏర్పాటు చేసి వెడ్డింగ్ కార్డు షేర్ చేసి ఆహ్వానించా. పరిస్థితిని అర్థం చేసుకొని దాదాపు అందరు నా కుమారుడి వివాహానికి వచ్చి ఆశీర్వదించారు. ఏదిఏమైనా ఆ సమయంలో వాట్సాప్ నాకు చాలా హెల్ప్ అయింది.

సీవీ.రమణయ్యశెట్టి, హెచ్ఎం, ఆకేపాడు ఉన్నత పాఠశాల, రాజంపేట మండలం

సైకిల్‌లో వెళ్లి ఇచ్చా



నాకు ముప్పై ఏళ్ల క్రితం వివాహం అయింది. ఆ రోజుల్లో రవాణా వ్యవస్థ పెద్దగా లేదు. అందువల్ల చుట్టుపక్కల ఉండే బంధువులకు, స్నేహితులకు సైకిల్‌పై వెళ్లిపెళ్లి పత్రికలు ఇచ్చా. సమయానికి సైకిల్‌ను ఇంట్లో వాళ్లు కాని, ఇరుగుపొరుగు వారు తీసుకెళ్లి వుంటే ఎవరో ఒకరిని తోడు చేసుకొని నడిచి వెళ్లి పెళ్లి పత్రికలు ఇచ్చాము. మా పిల్లల వివాహాలకు పెళ్లి పత్రికలు ఇవ్వడం పెద్దకష్టం అనిపించలేదు. బంధువులకు, ముఖ్యమైన మిత్రులు, కావాల్సిన వారికి మాత్రమే ఇంటికి వెళ్లి ఆహ్వానించా. మిగతా అందరికి వాట్సాప్‌లో వెడ్డింగ్ కార్డు షేర్ చేసి ఆహ్వానించా.

గుండ్రాతి చెంగల్‌రాయుడు, రాజంపేట

కార్డులు తక్కువగా అచ్చు వేయిస్తున్నారు



ఇటీవల కాలంలో చాలా మంది పెళ్లి పత్రికలను చాలా తక్కువగా అచ్చు వేయించుకుంటున్నారు. పెళ్లి పత్రికలను తక్కువగా వేయించుకుంటుండటం వల్ల ఖరీదైన వివాహ కార్డులను లేటెస్ట్ డిజైన్లలో ఎంపిక చేసుకుంటున్నారు. అందువల్ల వ్యాపారం కూడా కాస్త తగ్గింది. రాబోవు జనరేషన్ వివాహ ఆహ్వానాలన్నీ వాట్సాప్‌లలోనే కొనసాగించినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.

అనమలగుండం గణేష్, ప్రింటింగ్ ప్రెస్ యజమాని, రాజంపేట

వేరుశనగ పంటకు నిప్పు



నిప్పు పెట్టడంతో దగ్ధమైన వేరుశనగ పంట

గాలివీడు : మండల పరిధిలోని పూలుకుంట గ్రామం దళితవాడకు చెందిన వర్ల నారాయణమ్మ గుర్తు తెలియని వ్యక్తులు తమ వేరుశనగ పంటకు నిప్పుపెట్టారని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 699 బీ2 లో రెండు ఎకరాల భూమిలో వేరుశనగ పంట సాగు చేశానని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం కంచెగా ఏర్పాటు చేసిన కంపకు నిప్పు పెట్టడంతో వేరుశనగ పంట దగ్ధమైందన్నారు. బాధితురాలికి న్యాయం చేస్తామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

అగ్నికి చెట్లు ఆహుతి



దగ్ధమైన మామిడి, కొబ్బరి, చెట్లు

లక్కిరెడ్డిపల్లి : మండల పరిధిలోని అనంతపురం గ్రామ పంచాయతీ, ఎనమలవాండ్లపల్లెలో ఎనమల విశ్వనాథ్ అనే రైతు పొలం దగ్గర గుర్తు తెలియని వ్యక్తులు పొలాల గట్లకు నిప్పంటించారు. దీంతో మామిడి, కొబ్బరి, నేరేడు చెట్లు అగ్నికి ఆహుతయ్యాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు లక్ష రూపాయలు నష్టం వాటిల్లిందన్నాడు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని ఆయన కోరాడు.

ఫైనాన్స్ కంపెనీలో గోల్‌మాల్

విచారణ జరుపుతున్న విజిలెన్స్, ఆడిట్ బృందాలు

బి.కొత్తకోట : ఓ ఫైనాన్స్ కంపెనీ స్థానిక బ్రాంచి కార్యాలయంలో బంగారం తాకట్టుపై ఇచ్చిన రుణాల గోల్‌మాల్ వ్యవహారం వెలుగు చూడటంతో ఆ కంపెనీకి చెందిన విజిలెన్స్, ఆడిటింగ్ బృందాలు మూడు రోజులుగా విచారణ జరుపుతున్నాయి. దీంతో బంగారు తాకట్టు పెట్టిన ప్రజలు తమ పేరుతో ఏ మోసం చేశారో, అసలు తాము పెట్టిన బంగారం ఉందో లేదో అన్న ఆందోళనతో ఆ బ్రాంచికి క్యూ కడుతున్నారు. కొన్నేళ్ల క్రితం బ్రాంచీని ప్రారంభించిన ఆ కంపెనీ స్థానికంగా పనిచేసేందుకు కొందరు ఉద్యోగులను నియమించుకొంది. ప్రజలు నమ్మకంతో బంగారాన్ని తాకట్టు పెట్టి రుణాలు తీసుకుంటున్నారు. అయితే తాజాగా బంగారు తాకట్టు పెట్టిన కొందరికి రుణం మొత్తం చెల్లించినా అప్పు ఉందంటూ సమాచారం వెళ్లడంతో ఆరా తీశారు. దీంతో ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయి. ప్రజలు పెద్ద సంఖ్యలో బ్రాంచీవద్దకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత కంపెనీ తమ విజిలెన్స్, ఆడిటింగ్ బృందాలను పంపి విచారణ జరుపుతోంది. కాగా రుణాలు చెల్లించిన రోజుకు అయ్యే వడ్డీని కలిపి చెల్లించిన ఖాతాదారులకు కొన్నిసార్లు అదేరోజు బంగారు అప్పగించడం లేదు. రెండు లేక మూడు రోజుల తర్వాత ఇస్తూ..మళ్లీ ఈ మూడు రోజులకు వడ్డీని వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వచ్చాయి. ఇలా వసూలు చేసింది బ్రాంచీకి జమ చేస్తున్నారా లేదా అన్నది కూడా విచారణ జరపాలని ఖాతాదారులు కోరుతున్నారు. దీనిపై విచారణ జరుపుతున్న కంపెనీకి చెందిన ఓ అధికారి మాట్లాడుతూ అవకతవకలు జరిగాయని, స్వాహా చేసిన సొమ్ము ఎంత ఉంటుందన్నది విచారణ పూర్తయ్యాక కొలిక్కి వస్తుందని చెప్పారు.

పోలీసులకు సవాల్ విసురుతున్న కేబుల్ దొంగలు

- 15 రోజుల్లో రూ.9 లక్షల విలువైన కేబుల్ వైర్లు చోరీ
- లబోదిబోమంటున్న రైతులు



గండిమాలపల్లి వద్ద చోరీకి గురైన కేబుల్ వైర్లు

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె మండలంలో కేబుల్ వైర్ల దొంగలు రెచ్చిపోతూ పోలీసులకే సవాల్ విసురుతున్నారు. గత 15 రోజుల్లో నిమ్మనపల్లి అగ్రహారం తవళం వెంకన్నవారిపల్లె గ్రామాలలోని వివిధ వ్యవసాయ బోర్ల వద్ద రూ. 9 లక్షల విలువైన కేబుల్ వైర్లు వివిధ ప్రాంతాల్లో చోరీ చేశారు. రైతులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదులు చేసినా, స్పందన లేకపోవడంతో కేబుల్ వైర్ల దొంగలు మరింతగా చెలరేగిపోతున్నారు. మంగళవారం రాత్రి మరోసారి మండలంలోని నిమ్మనపల్లి, తవళంలోను, అగ్రహారం పంచాయతీ ఆరిపిరెడ్డిగారిపల్లెకు చెందిన వేణుగోపాల్ రెడ్డి వ్యవసాయ బోరు వద్ద రెండవసారి కేబుల్ వైర్లు చోరీ చేశారు. స్థానికంగా ఉన్న తాగునీటి బోరు వద్ద సుమారు 80 మీటర్లు కేబుల్ వైర్లను దుండగులు దోచుకెళ్లారు. వేసవికాలంలో వరి, టమాటా, ఇతర పంటలకు సకాలంలో నీరు అందించటానికి రైతులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుండగా, మరోవైపు వరుస కేబుల్ వైర్ల చోరీలతో రైతులు హడలిపోతున్నారు. ఇప్పటికే పలుమార్లు బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా స్పందన లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ. 15 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం



ఎర్రచందనం దుంగలు, కారుతోపాటు నిందితుడిని అరెస్టు చేసిన అధికారులు

పీలేరు : కారుతోపాటు రూ.15 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు డీఎఫ్ఓ గురుప్రభాకర్ తెలిపారు. స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలోని ఎంజేఆర్ కాలేజీ వద్ద మంగళవారం రాత్రి నుంచి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన కారును అటవీ సిబ్బంది ఆపే ప్రయత్నం చేశారు. అయితే డ్రైవర్ ఆపకుండా వేగంగా ముందుకు వెళ్లడంతో సిబ్బంది అప్రమత్తమై వెంబడించి అశోక్ నగర్ వద్ద పట్టుకున్నారు. వాహనంతోపాటు 301 కేజీల బరువు గల ఎర్రచందనం దుంగలు స్వా ధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన వెంకటేష్‌ను అరెస్ట్ చేసినట్లు డీఎఫ్ఓ తెలిపారు. ఈ దాడిలో సిబ్బంది చంద్రశేఖర్, ప్రతాప్, కుప్పుస్వామి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపునకు విచారణ

ఓబులవారిపల్లె : వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు అంటూ గోవిందంపల్లి పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి పెంచలయ్యపై తెలుగుదేశం పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం ఏపీడీ ప్రతాప్ గోవిందంపల్లి గ్రామంలో విచారణకు వచ్చారు. చాలాకాలం నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పెంచలయ్య ఎలాంటి వివాదాల జోలికి వెళ్లకుండా తన పనితాను చేసుకుంటూ వెళ్లేవారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపారనే నెపంతో స్థానిక టీడీపీ నాయకులు అతన్ని తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ విచారణ అధికారిని నియమించారు. తాను ఏతప్పు చేయలేదని, తనపై కావాలని ఫిర్యాదు చేశారని పెంచలయ్య వాపోయాడు.

రూ.200 మందుకు రూ.1000 జరిమానా

రశీదు ఇవ్వలేదంటూ పోలీసు స్టేషన్ ఎదుట తెలుగు తమ్ముడి ఆగ్రహం



రవికుమార్

రాయచోటి : రూ. 200 వెచ్చించి మద్యం తాగుతున్న తనకు వెయ్యి రూపాయలు జరిమానా విధించిన పోలీసులు రశీదు ఎందుకు ఇవ్వలేదంటూ తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ మందుబాబు పోలీసు స్టేషన్ ఎదుటే పోలీసుల తీరును తూర్పారబట్టాడు. బుధవారం రాయచోటి పోలీస్ స్టేషన్ ఆవరణంలోనే నిరసన తెలుపుతూ తెలుగుదేశం పార్టీకి చెందిన రవికుమార్ అనే వ్యక్తి విడుదల చేసిన వీడియో సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతోంది. రాయచోటిలోని మదనపల్లి మార్గంలో ఉన్న ఓ మద్యం షాపు పక్కనే ఏర్పాటు చేసిన అనధికార మద్యం షాపులో రూ. 200 వెచ్చించి బీరు కొనుగోలు చేశానన్నాడు. ఓ హోటల్‌లో కూర్చుని బీరు తాగినందుకు హోటల్ యజమానిని వదిలి పోలీసులు తనను పట్టుకొచ్చారన్నాడు. తన సెల్‌ఫోన్ లాక్కొని వెయ్యి రూపాయలు జరిమానా విధించారని, ఇందుకు ఎలాంటి రశీదు ఇవ్వలేదన్నాడు. ప్రతిరోజూ వందల మంది మందు బాబులను ఆఫీసర్లు లేని సమయంలో పట్టుకురావడం, వెయ్యి రూపాయలు వసూలు చేయడం మామూలైపోయిందని మండిపడ్డాడు. ఈ డబ్బులు ఎవరి ఖాతాలోకి వెళ్తున్నాయని ఆ తెలుగు తమ్ముడు స్టేషన్ ఆవరణంలో ప్రశ్నించడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

స్కూలు విద్యార్థుల ఆటో బోల్తా

- నలుగురికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



ప్రమాదానికి గురైన ఆటో



తీవ్రంగా గాయపడిన సాహితి, గాయపడిన విష్ణు

గుర్రంకొండ : సాయంకాలం పాఠశాల వదిలిన అనంతరం సొంత గ్రామానికి వెళదామంటే ఆర్టీసీ బస్సు లేదు. దీంతో విద్యార్థులు ఆటో ఎక్కారు. మార్గ మధ్యంలో రోడ్డు ప్రమాదానికి గురై నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సరిమడుగు పంచాయతీ పుల్లావాండ్లపల్లెకు చెందిన మిట్టపల్లి స్వాతి(13), కె.సాహితి(13), కురాకుల విష్ణు(13)లు గుర్రంకొండలోని తెలుగు జెడ్పీ హైస్కూలులో ఎనిమిదవ తరగతి చదువుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన కురాకుల అరుణ్(17) గుర్రంకొండలోని తెలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలుగు జెడ్పీ హైస్కూల్ ఒకే ఆవరణంలో నిర్వహిస్తున్నారు. బుధవారం పాఠశాల, కళాశాల పనివేళలు ముగిసిన అనంతరం అందరూ సొంత గ్రామాలకు వెళ్లడానికి బయలుదేరారు. అయితే ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు సర్వీసు లేక పోవడంతో నలుగురు కలిసి ఆటోలో ఎక్కారు. ఆటో స్థానిక ఎర్రమిట్ట వద్దకు చేరుకోగానే డ్రైవర్ హఠాత్తుగా బ్రేకు వేయడంతో రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సాహితికి తీవ్ర గాయాలు కాగా మిగిలిన ముగ్గురికి రక్త గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థులను హుటాహుటిన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సాహితి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సలహా మేరకు తిరుపతి ఆస్పత్రికి తరలించారు. మిగిలిన ముగ్గురిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న రాజశేఖర్, వినోద్

రాయచోటి అర్బన్ : రాజంపేటలోని అన్నమాచార్య యూనివర్సిటీలో జరుగుతున్న వరుస ఆత్మహత్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విచారణ జరపాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.రాజశేఖర్, ఎం.వినోద్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వడిగ్రీ కళాశాల వద్ద విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అన్నమాచార్య యూనివర్సిటీలో గత 8 నెలల కాలంలో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడానికి యాజమాన్యమే బాధ్యత వహించాలన్నారు. విద్యార్థుల మధ్య తరచూ జరుగుతున్న గొడవలతో వారు ఆత్మన్యూనతకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, కోశాధికారి జాకీర్, జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాడి ఓడిన కవిత



మృతి చెందిన కవిత

ములకలచెరువు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కవిత(25) మృత్యువుతో పోరాడి ఓడిపోయింది. వివరాలు ఇలా..బి.కొత్తకోట మండలం కుమ్మరపల్లెకు చెందిన సోముశేఖర్, ఇద్దరు చిన్నారులు సిద్దేశ్వరీ, రెడ్డిశేఖర్, భార్య కవితలు గత శనివారం ద్విచక్రవాహనంలో సత్యసాయి జిల్లా కదిరిలో జరిగే అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బైకుపై బయలుదేరారు. ములకలచెరువు సమీపంలో ఎదురుగా ఐచర్ వాహనం ఢీ కొనడంతో భర్త, ఇద్దరు పిల్లలు మృతి చెందిన విషయం విదితమే. తీవ్రంగా గాయపడిన కవిత తిరుపతి రుయా ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతోంది. ఐదు రోజులుగా మృత్యువుతో పోరాడి బుధవారం కన్ను మూసింది. మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బి.కొత్తకోట మండలం కుమ్మరపల్లెలో కవిత అంత్యక్రియలు నిర్వహించారు.

ఆటో నుంచి పడి భవన నిర్మాణ మేస్త్రీ దుర్మరణం



మృతి చెందిన తిప్పన్న

మదనపల్లె : కూలీల కోసం వెళుతూ ఆటోలో నుంచి కిందపడి భవన నిర్మాణ కార్మిక మేస్త్రీ దుర్మరణం పాలైన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. చిప్పిలి గ్రామానికి చెందిన తిన్నప్ప కుమారుడు సి. తిప్పన్న (64) భవన నిర్మాణ కార్మిక మేస్త్రీగా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం పనులకు కూలీలు అవసరం కాగా, మదనపల్లి నుంచి బొమ్మనచెరువుకు ఆటోలో బయలుదేరాడు. ఆటోలో వెనకవైపు కూర్చుని ఉండగా, మార్గమధ్యంలోని కొత్తపల్లి బ్రిడ్జి వద్ద రోడ్డులోని గుంతలను తప్పించేందుకు ఆటో డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో, వెనక కూర్చున్న తిప్పన్న ఆటోలో నుంచి కింద పడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కాగా, అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. సమాచారం అందుకున్న తాలూకా ఎస్ఐ గాయత్రి సంఘటనా స్థలానికి వెళ్లి, రోడ్డు ప్రమాద వివరాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. భార్య గంగులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..



రోడ్డు ప్రమాదంలో గాయపడిన శ్రీనివాసులు

రామాపురం : రాయచోటి - వేంపల్లి రహదారిలోని కుమ్మరపల్లె సమీపంలో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో ద్విచక్రవాహనదారులు శ్రీనివాసులు, జఫ్రిన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి వివరాల మేరకు.. కొమ్ములపల్లె పంచాయతీ బండపల్లెకు చెందిన శ్రీనివాసులు, జఫ్రిన్ బైకుపై ఇంటి వద్ద నుంచి పొలంలోని ఉలవకాయలు కోసేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలో కుమ్మరపల్లి సమీపంలో వెనుక వైపు నుంచి వచ్చిన వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ సంఘటనలో శ్రీనివాసులు కాలు విరిగింది. జఫ్రిన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని పోలీసులు 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సు ఢీకొని..



గాయపడిన సాదిక్ వలీ

రాజంపేట : రాజంపేట పట్టణంలోని అమ్మవారిశాల వద్ద బుధవారం సాదిక్‌వలీ అనే వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీ కొంది. చికిత్స నిమిత్తం రాజంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. బస్సును రాజంపేట అర్బన్ పోలీసు స్టేషన్ వద్దకు చేర్చారు.పోలీసులు కేసు నమోదు చేశారు.

గంగమ్మ జాతర ఏర్పాట్లపై ఆరాతీసిన ఈఓ

లక్కిరెడ్డిపల్లి : మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో గంగమ్మ తల్లి జాతర మార్చి 1, 2 తేదీల్లో అత్యంత వైభవంగా జరగనుంది. జాతరకు రాయలసీమలోని నాలుగు జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. ఈ నేపథ్యంలో ఆలయ ఈఓ శ్రీనివాసులు ఏర్పాట్లపై ఆరా తీశారు. భక్తులకు ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిమూలం రామచంద్ర, సునీల్ యాదవ్, బోసు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.